క్లుప్తంగా

అంకమ్మతల్లి శక్తిపీఠంలో పౌర్ణమి పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ నేతాజీకాలనీ శ్రీ అంకమ్మతల్లి శక్తిపీఠంలో సోమవారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పీఠం వ్యవస్థాపకుడు అన్నాబత్తుల శరాబందీరావు అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమ పూజలు, శ్రీ చక్రార్చనలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

బాబా మందిరంలో ప్రత్యేక పూజలు..

పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో సోమవారం పౌర్ణమి సందర్భంగా బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. శ్రీసాయి నక్షత్ర మాలిక మండలి ఆధ్వర్యాన పారాయణం జరిగింది. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమాలను ఆలయ వ్యవస్థాపకుడు తంగెళ్లమూడి వీరమోహనరావు పర్యవేక్షించారు.

నాగమానసాదేవి మందిరంలో డోలీ ఉత్సవం



మధురానగర్(విజయవాడసెంట్రల్): హోలీ సందర్భంగా లెనిన్ సెంటర్‌లోని ఓం శ్రీషిర్డీ నాగసాయి బాబా-నాగమానసాదేవి మందిరంలో మహిళలు నాగమానసాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు, డోలీ ఉత్సవం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు ఆలయానికి చేరుకుని పసుపు, కుంకుమ అమ్మవారికి సమర్పించారు. మందిర వ్యవస్థాపకుడు సుధాస్వామి ఆధ్వర్యంలో మహిళా భక్తులకు పసుపు, కుంకుమ, గాజులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుధాస్వామి మాట్లాడుతూ పౌర్ణమి రోజున శ్రీకృష్ణుడు గోపికలతో కలిసి బృందావనంలో పువ్వులు, రంగులతో ఉత్సవాన్ని జరుపుకొన్నారని, అప్పటి నుంచి డోలోత్సవం నిర్వహించడం జరుగుతోందని హోలీ విశిష్టతను వివరించారు. హోలీని అగ్నితో పునీతమైన రోజుగా కూడా భావిస్తారని అన్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో సాయిబాబా భక్తులు కనకమేడల భరత్‌భూషణ్- శివ పార్వతి, వెన్నా రామాంజనేయులు-రమాదేవి దంపతులు, ఇందిర, ఉమ, పద్మ, ధనలక్ష్మి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అలాగే నగరంలోని పలు ప్రాంతాల్లో యువతీ యువకులు రంగులు చల్లుకుంటూ హోలీ జరుపుకొన్నారు.

సామాజిక బాధ్యతగా చలివేంద్రాల ఏర్పాటు



మధురానగర్(విజయవాడసెంట్రల్): వేసవిలో దాహార్తుల దప్పిక తీర్చేందుకు సామాజిక బాధ్యతగా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ ఛైర్మన్ డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి అన్నారు. స్థానిక సత్యనారాయణపురం వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ కార్యాలయం వద్ద సోమవారం వైఎస్సార్ సీపీ నాయకులు పసి ఆధ్వర్యాన చలివేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గౌతంరెడ్డి మాట్లాడుతూ ప్రతీఏటా క్రమం తప్పకుండా చలివేంద్రం ఏర్పాటు చేస్తున్న పసిని ప్రతీ ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకుని తోచినంతలో సేవా కార్యక్రమాలు చేయాలని సూచించారు. అనంతరం దాహార్తులకు పసితో కలిసి మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు రమేష్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

పెనమలూరు: రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు అవ్వటంతో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎస్.నాగమణి యనమలకుదురు ఇందిరానగర్‌లో నివాసం ఉంటోంది. రామలింగేశ్వర నగర్‌లో ఆమె కుమార్తె టైలరింగ్ షాపు నిర్వహిస్తోంది. కాగా నాగమణి కుమార్తె షాపు వద్దకు వెళ్లి తిరిగి ఇంటికి రావటానికి రాపిడో బైక్ బుక్ చేసింది. ఆమె బైక్‌పై బయలుదేరింది. బైక్ నడుపుతున్న వ్యక్తి యనమలకుదురు వంతెన వద్దకు వచ్చిన తరువాత ఎదురుగా వచ్చిన ఆటోను ఢీ కొట్టాడు. ఈ ఘటనలో ఆమె బైక్‌పై నుంచి పడిపోవటంతో తలకు గాయమైంది. పటమట ఆస్పత్రిలో ఆమెను చికిత్సకు చేర్చారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

అభివృద్ధికి కేరాఫ్ 33వ డివిజన్

- పాఠశాలలు, దేవాలయాలు, రోడ్లకు మహర్దశ
- రూ. 2.50 కోట్లతో యూజీడీ సంపు నిర్మాణం
- డివిజన్ అభివృద్ధిపై స్థానికుల హర్షం



ఏకేపీటీపీ స్కూల్‌లో చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణం



ఆంధ్రరత్న పార్కులో ఓపెన్ జిమ్

ఇది కదా.. అభివృద్ధి

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): నగరం నడిబొడ్డున ఆధ్యాత్మిక ప్రాంతంగా వెలుగొందుతున్న సత్యనారాయణపురం ప్రాంతానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనే మరింత శోభ వచ్చింది. గత ప్రభుత్వంలో కార్పొరేటర్ నుంచి సీఎం వరకు అన్ని స్థాయిల్లోనూ టీడీపీ ప్రజాప్రతినిధులు ఉన్నప్పటికీ 33వ డివిజన్‌ను పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. కానీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానిక ఎమ్మెల్యే మల్లాది విష్ణు, కార్పొరేటర్ శర్వాణీమూర్తి సత్యనారాయణపురం అభివృద్ధిపై చక్కని ప్రణాళికతో ముందుకు వెళ్లారు. డివిజన్‌లో నూతన సీసీ రోడ్లు, సరికొత్త హంగులతో పాఠశాలలు, దేవాలయాలకు పూర్వవైభవం, మురుగు నీటి ముంపునకు శాశ్వత పరిష్కారంతో పాటుగా సంక్షేమ ఫలాలు పొందుతున్న అన్ని వర్గాల వారు 'ఇది కదా అభివృద్ధి అంటే' అంటూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నూతన సీసీ రోడ్ల నిర్మాణాలు..

ప్రధానంగా 'గడప గడపకి మన ప్రభుత్వం'లో భాగంగా డివిజన్‌లో పర్యటించిన ప్రజాప్రతినిధులు పలుచోట్ల వర్షపు నీరు నిలిచిపోవడాన్ని గుర్తించారు. జల్లావారి వీధి, ఓగిరాలవారి వీధి, కావూరివారి వీధి, తిరుమలశెట్టివారి వీధి, తాడంకివారి వీధి, దాక్షిణ్యంవారి వీధి, పాపరాజు వీధి, కొమ్ముువారి వీధి, కనకరాజు వీధి సహా 13 వీధుల్లో నిర్మించిన నూతన రహదారులతో ఈ ప్రాంత ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం లభించినట్లయింది. అలాగే వ్యాకరణంవారి వీధి, రామమందిరం వీధి, ముదిగొండవారి వీధుల్లో రహదారుల పనులకు ఇటీవల శంకుస్థాపనలు చేశారు. మరో పాతికేళ్ల వరకు ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా అత్యంత నాణ్యత ప్రమాణాలతో ఈ పనులన్నింటినీ పూర్తి చేయడం జరుగుతోంది. టీడీపీ హయాంలో ఈ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడకుండా యూజీడీకి సంబంధించి ఒక సంపు నిర్మించాలనే కనీస ఆలోచన చేయలేకపోయారు గత పాలకులు. కానీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ. 2.50 కోట్లతో చేపట్టిన యూజీడీ సంపు నిర్మాణ పనులు తుదిదశకు చేరుకోగా.. త్వరలోనే ప్రారంభం కానుంది.



కావూరివారివీధిలో సీసీ రోడ్డు

నాడు-నేడుతో పాఠశాలలకు మహర్దశ..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కార్పొరేట్ స్కూళ్లను తలదన్నేలా ప్రభుత్వ పాఠశాలలు చక్కటి వాతావరణాన్ని సంతరించుకున్నాయి. మంచినీటి సదుపాయం, మరుగుదొడ్లు, విద్యుత్ సదుపాయం, లైట్లు, ఫ్యాన్లు, బెంచీలు, ఫర్నీచర్, గ్రీన్ చాక్ బోర్డులు, పెయింటింగ్, ఇంగ్లీష్ ల్యాబ్స్, ప్రహరీ గోడలతో అధునాతనంగా ముస్తాబవుతున్నాయి. ఈ ప్రాంతానికి సంబంధించి ఏకేపీటీపీ పాఠశాలలో రూ. 2.62 కోట్లు, ప్రశాంతి ప్రాథమిక పాఠశాలలో రూ. 30 లక్షలతో చేపట్టిన నాడు-నేడు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. దీంతో ఈ ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల కోసం విద్యార్థులు క్యూ కడుతున్నారు.

సర్వాంగ సుందరంగా పార్కులు..

డివిజన్ ప్రజలకు ఆరోగ్యంతో పాటు ఆహ్లాదాన్ని అందించేలా రూ. 20 లక్షలతో ఆంధ్రరత్న పార్కును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. పార్కులో విశాలమైన వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, షటిల్ కోర్టు, కాంపౌండ్ వాల్, మంచినీటి సదుపాయం కల్పించి ఇటీవలే ప్రారంభించుకోవడం జరిగింది. ఉదయం, సాయంత్రం వేళల్లో పిల్లలతో కలిసి సరదాగా గడపడానికి దూర ప్రాంతాలకు వెళ్లకుండా ఈ పార్కు ఎంతగానో దోహదపడుతోందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధి దిశగా పరుగులు



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సత్యనారాయణపురం అభివృద్ధి దిశగా పరుగులు పెడుతోంది. అమ్మ ఒడి, పెన్షన్లు, నిరుపేదలకు ఇళ్లు, ఈబీసీ నేస్తంతో అగ్రవర్ణ పేద మహిళలకు చేయూత అందించడం వంటి అనేక పథకాలతో పాటుగా డివిజన్‌లో రోడ్లు, పార్కులు, దేవాలయాలు పూర్తిగా అభివృద్ధి చెందాయి. అదేవిధంగా ఈ ప్రాంత ప్రజల అభ్యర్థన మేరకు చేపట్టిన కర్మల భవనం ఆధునీకరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. గతంలో ఎప్పుడూ చూడని అభివృద్ధి తమ డివిజన్‌లో జరుగుతుండటంతో ప్రజలందరూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించుకుంటామని చెప్పడం వారి సంతృప్తికి నిదర్శనం. – శర్వాణీమూర్తి, కార్పొరేటర్

దేవాలయాలకు పూర్వవైభవం..

ఆధ్యాత్మిక ప్రాంతంగా వర్ధిల్లుతున్న సత్యనారాయణపురంలో దేవాలయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారు. వందేళ్ల ఘన చరిత్ర కలిగిన శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో రూ. 70 లక్షల సీజీఎఫ్(కామన్ గుడ్ ఫండ్) నిధులు విడుదలయ్యాయి. ఈ ప్రాంతంలో పురోహిత భవన్ నిర్మాణానికి రూ. 72 లక్షల సీజీఎఫ్ నిధులు విడుదల చేస్తూ దేవదాయ శాఖ పాలనాపరమైన అనుమతులనివ్వడం జరిగింది. అలాగే ఈ ప్రాంతంలోనే శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ నిర్మాణంతో ఆర్యవైశ్యుల దశాబ్దాల కల నెరవేర్చడం జరిగింది.

రూ. 21.31 కోట్ల సంక్షేమం..

మహిళా సంక్షేమం కోసం మన రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాలు దేశంలో మరే రాష్ట్రంలో అమలు కావడం లేదనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. వైఎస్సార్ పింఛన్ కానుక ద్వారా డివిజన్‌లో ప్రతి నెలా 974 మందికి ఇంటి వద్దకే ఠంఛన్‌గా పింఛన్ అందజేయడం జరుగుతోంది. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా 567 మంది అక్కచెల్లెమ్మలకు రూ. 1.65 కోట్లు, అమ్మఒడి పథకం ద్వారా 575 మంది తల్లులకు రూ. 1.74 కోట్లు, చేదోడు ద్వారా 57 మందికి రూ. 12 లక్షలు, ఈబీసీ నేస్తం ద్వారా 381 మందికి రూ. 97.65 లక్షలు, జగనన్న విద్యాదీవెన ద్వారా 476 మందికి రూ. 1.78 కోట్లు, వసతి దీవెన ద్వారా 446 మందికి రూ. 55 లక్షలు, కాపు నేస్తం ద్వారా 43 మందికి రూ. 13.80 లక్షలు, సున్నావడ్డీ పథకం ద్వారా 792 మందికి రూ. 24.33 లక్షలు, వైఎస్సార్ చేయూత ద్వారా 105 మందికి రూ. 39.93 లక్షలు అందజేయడం జరిగింది. ఇలా వివిధ సంక్షేమ పథకాల ద్వారా డివిజన్ ప్రజలకు ఐదేళ్లలో అక్షరాల రూ. 21.31 కోట్ల లబ్ధి చేకూరింది. మహిళలకు ఆర్థిక చేయూతనందించడం ద్వారా కేవలం ఐదేళ్ల కాలంలోనే పేదరికంపై వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నూటికి నూరు శాతం విజయం సాధించింది.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే మల్లాది పరామర్శ

పాయకాపురం(విజయవాడరూరల్): ప్రకాష్ నగర్ వద్ద(విజయవాడ-నూజివీడు ప్రధాన రహదారిపై)శుక్రవారం లారీ ఢీ కొనడంతో ప్రాణాలు కోల్పోయిన చిలుమూరి సాయిరామ శేష్టకిరణ్(17) కుటుంబాన్ని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు సోమవారం పరామర్శించారు. యువకుడి మృతి పట్ల ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ఓదార్చారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసిన పరిసర ప్రాంతంలోనే ఇటువంటి ప్రమాదం జరగడం బాధాకరమని ఈ సందర్భంగా మల్లాది విష్ణు అన్నారు. యువకుడి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీని గెలిపించుకుందాం



మధురానగర్(విజయవాడసెంట్రల్): నవరత్నాలతో ప్రతీ ఇంటా వెలుగులు నింపిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనపైనే ఉందని ఆ పార్టీ 32వ డివిజన్ ఇన్‌ఛార్జి గుండే సుందర్‌పాల్ అన్నారు. స్థానిక 32వ డివిజన్‌లో సోమవారం 'మేము సిద్ధం-మా బూత్ సిద్ధం' పేరిట ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి మనసున్న మనిషి ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, కేశినేని నానిలకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళ కార్యదర్శి పేరం త్రివేణీరెడ్డి మాట్లాడుతూ అహర్నిశలు మహిళల సంక్షేమం కోసం శ్రమిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి యావత్ మహిళా లోకం అండగా ఉంటుందన్నారు. చంద్రబాబును ప్రజలు నమ్మేస్థితిలో లేరని రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కరేటి రమేష్, గొల్ల రంగారావు, గృహసారధులు, కన్వీనర్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప జన్మదిన వేడుకలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలు సోమవారం దుర్గాపురం అయ్యప్పస్వామి మందిరంలో శ్రీ మణికంఠ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఘనంగా జరిగాయి. స్వామివారికి విశేషంగా 21 దివ్య ద్రవ్యములతో అభిషేకం, అర్చన, పూజలు చేశారు. అలాగే స్వామివారికి అన్నాభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం రెండు వేల మందికి అన్నప్రసాద వితరణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను ట్రస్ట్ వ్యవస్థాపకుడు బల్లెం పూర్ణయ్య గురుస్వామి పర్యవేక్షించారు.

బీఆర్‌టీఎస్ రోడ్డులో..

మాచవరం బీఆర్‌టీఎస్ రోడ్డులో సోమవారం అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో సెంట్రల్ నియోజకవర్గ అభ్యర్థి ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామివారిని భక్తితో సేవిస్తే సకల కష్టాలు తీరుతాయన్నారు. అయ్యప్పస్వామి ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలని, ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అనంతరం స్థానిక కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరితో కలిసి అన్నప్రసాద వితరణ ప్రారంభించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.




పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

పౌర్ణమి వేళ ఆర్జిత సేవలకు డిమాండ్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): పాల్గుణ పౌర్ణమి వేళ ఇంద్రకీలాద్రిపై ఆది దంపతుల సన్నిధిలో నిర్వహించిన పలు ఆర్జిత సేవల్లో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. తెల్లవారుజామున అమ్మవారికి ఖడ్గమాలార్చన, ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చన, చండీహోమం, శాంతి కల్యాణంతో పాటు సాయంత్రం పంచహారతుల సేవలో విశేషంగా పాల్గొన్నారు. పౌర్ణమి నేపథ్యంలో అమ్మవారి మూలవిరాట్‌ను స్వర్ణకవచంతో అలంకరించారు. చండీ హోమం, లక్ష కుంకుమార్చనలు పెద్ద ఎత్తున ఉభయదాతలు పాల్గొనడంతో రద్దీ అధికంగా కనిపించింది. మరో వైపున ఆర్జిత సేవల్లో పాల్గొన్న ఉభయదాతలకు ప్రత్యేక క్యూలైన్ మార్గం ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు.

సంధ్యా సమయాన..



సాయం సంధ్యావేళ భానుడు అస్తమిస్తున్న తరుణంలో వెలువడే ఎర్రటి సూర్య కిరణాలు కృష్ణానదిపై ప్రసరిస్తున్నప్పుడు నాటు పడవపై చేపలు వేటాడుతున్న మత్స్యకారుడి చిత్రమిది.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

సెల్ ఫోన్ వినియోగంతో జ్ఞాపకశక్తి మందగిస్తుంది

నున్న(విజయవాడరూరల్): సెల్‌ఫోన్ ఎక్కువగా వినియోగించడంతో జ్ఞాపకశక్తి మందగిస్తుందని కెరీర్ కౌన్సిలర్ తుమ్మల దీప్తి అన్నారు. నున్న వికాస్ కాలేజీలో సోమవారం పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సెల్ ఫోన్లు వాడటం వల్ల కలిగే ఇబ్బందులను వివరించారు. పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ గోపాల్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కిషోర్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

బెల్టుషాపు నిర్వాహకుడి అరెస్ట్

కంకిపాడు: మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిని కంకిపాడు పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. ఎస్ఐ డి.సందీప్ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని గొడవర్రు గ్రామంలో బెల్టుషాపు నిర్వహిస్తున్న కాగిత సత్యనారాయణ వద్ద తనిఖీ చేయగా ఎనిమిది మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయి. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని సత్యనారాయణపై కేసు నమోదు చేశారు. బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సందీప్ హెచ్చరించారు.

మహనీయుల త్యాగాలు సదా స్మరణీయం



విజయవాడ కల్చరల్: దేశ స్వాతంత్ర్య పోరాటంలో అసువులు బాసిన మహనీయుల త్యాగాలు సదా స్మరణీయమని తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు అన్నారు. ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక, తెలుగు కళావాహిని, శ్రీ కళాభారతి ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో సోమవారం భగత్‌సింగ్ 93వ వర్ధంతి, దేశ భక్తి గీతాలు, మేకప్‌మెన్ అడవి శంకరరావుకు ఆత్మీయ సత్కార కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ యువతలో దేశ భక్తి, జాతీయ భావం, సమైక్యత భారతం పట్ల అవగాహన కలిగించాల్సిన అవసముందన్నారు. ఘంటశాల చైతన్య వేదిక వ్యవస్థాపకుడు కోట వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ సుఖదేవ్, రాజ్‌గారు, భగత్ సింగ్‌ల సేవలను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. సత్కార గ్రహీత అడవి శంకరరావు మాట్లాడుతూ 60 సంవత్సరాలుగా మేకప్ రంగంలో ఉన్నానన్నారు. కళాకారుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న ప్రభుత్వ సేవలను అభినందించారు. విశ్రాంత పోలీస్ అధికారి డేవిడ్‌రాజు మాట్లాడుతూ మాతృదేశ సేవలో యువత తరించాలని పేర్కొన్నారు. అనంతరం సీనియర్ మేకప్ మెన్ అడవి శంకరరావును నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు. గాయనీ గాయకులు దుర్గానాగమణి, మల్లీశ్వరి, ప్రిన్స్, రోజాలక్ష్మి, శ్యాంప్రసాద్ తదితరులు దేశ భక్తి గీతాలను ఆలపించారు.

రంగుల హోలీ..







విజయవాడ నగరంలో హోలీ వేడుకలు సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే యువతీ యువకులు రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. వివిధ రకాల రంగు నీళ్లు ఒకరిపైనొకరు కొట్టుకుంటూ ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు ఎంతో ఉత్సాహంగా హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. గురునానక్ కాలనీలో యువతీ యువకులు నృత్యాలు చేస్తూ రంగులు పూసుకుంటూ హోలీ పండుగ చేసుకున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

